


# శిక్ష

## వల్లూరు శివప్రసాద్

వీధిలో కారాగినశబ్దం విన్నప్పటికీ పడక కుర్చీలో కళ్లుమూసుకుని పడుకున్న సుబ్బారావుగారు స్తబ్ధంగా వుండిపోయేరు. విచారణ చేసేందుకు పోలీసులు వచ్చి వుంటారనుకున్నారు. అడపాదడపా వచ్చిపోతున్నవాళ్ళ మొహాల్లో తేడానే కాని అడిగే ప్రశ్నల్లో మార్పు లేదు. ఇదంతా నిరర్థకమైన తప్పనిసరి తంతులా ఆయనకు తోస్తున్నది.

గుమ్మందగ్గర అడుగుల చప్పుడుకు కళ్లుతెరిచి చూసేరు. ఆయన భావిస్తున్నట్లు వచ్చింది పోలీసులు కాదు. నడి వయస్కుడైన ఒక అపరిచితుడు.

"సుబ్బారావుగారంటే మీరే గదూ!" ఆయన పలకరింపులో స్నేహభావం వుట్టిపడుతున్నది.

"అవును లోపలకు రండి" అంటూ లేచి సాదరంగా ఆహ్వానించారు.

వచ్చిన వ్యక్తి చెప్పులు గడపవతల వదిలి లోపలకు అడుగుపెట్టాడు. గోడ వారగా వున్న మరో కుర్చీని ఇవతలకు లాగి కూర్చోమని మర్యాద చేసేరు. అతన్ని ఎన్నడూ చూసిన గుర్తుగాని, గతంలో పరిచయం ఉన్నట్లుగాని జ్ఞాపకం లేదాయనకు.

"నమస్కారం మాస్టారూ! ఇదే మనం తొలిసారి కలుసుకోవటం. నా పేరు భూపాలరావు. విజయవాడనుండొచ్చాను." పరిచయం చేసుకున్నాడు.

యాంత్రికంగా చేతులు జోడించిన సుబ్బారావుగారి ముఖంలో ఆయన పేరు వింటూనే నీలినీడలు కమ్ముకున్నాయి. అనూహ్యంగా ఆయన రావటం ఎంతో ఆశ్చర్యానికి కారణమైంది. అది భూపాలరావు గమనించలేకపోలేదు.

ఆయన రాకలోని అంతరార్థం సుబ్బా

రావుగారికి బోధపడటంలేదు. సంభాషణ ఎలా ప్రారంభించాలో తోచటంలేదు.

పరిచయాలనేవి స్నేహపూర్వకంగా మొదలవుతాయి. కాని ఇబ్బందికరంగా వుండటమనేది అరుదైన విషయం. ఇద్దరి మధ్య చోటుచేసుకున్న మౌనం వాతావరణాన్ని గంభీరంగా మార్చింది.

"జరిగినదానికి నేనెంతో బాధపడుతున్నాను." భూపాలరావు కంఠం భారంగా ధ్వనించింది.

సుబ్బారావుగారు కుర్చీలో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నారు. మనసులో చెలరేగిన సంక్షోభాన్ని అణుచుకునేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నంలో ఒక భాగం అది.

"క్షమించమనే అర్హత కూడా నాకు లేదని తెలుసు. ఈ దుర్ఘటన జరిగిన రోజు నేను వూళ్ళో లేను. తెలిసిన వెంటనే ఢిల్లీనుండి తిరిగొచ్చాను." అన్నారు సూటిగా సుబ్బారావుగారికేసి చూడలేకపోతూ.

సుబ్బారావుగారు పెదవి విప్పలేదు.

భూపాలరావు దృష్టి గోడమీదున్న కేబినెట్ సైజు ఫోటోమీద నిలిచింది. చిరునవ్వు చిందిస్తున్న లేతముఖం, మామూలు మీసాల తొలియవ్వనం, నిర్మలత్వం వుట్టిపడుతున్న చూపులు.... పోలికల్ని బట్టి సుబ్బారావుగారి కొడుకుగా వూహించాడు. ఆ అబ్బాయి చూపులు తన గుండెల్లోంచి దూసుకెళ్తున్నట్లనిపించి దృష్టి మరల్చారు.

"మాస్టారూ! నేనూ ఒక బిడ్డ తండ్రినే! మీ బాధను అర్థంచేసుకోగలను. మీకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దలేనని తెలుసు. అయినా సాటి మనిషిగా ఉండబట్టలేక వచ్చాను." ఆయన కంఠంలో సానుభూతి ధ్వనించింది.

సుబ్బారావుగారు కళ్ళు విప్పి ఆయనకేసి చూసేరు. "భూపాలరావుగారూ! జీవితంలో కొన్ని దెబ్బలు మచ్చలై కలిసిపోతాయి. కొన్ని మాత్రం మానవీ గాయాలుగానే నిలిచిపోతాయి." ఆయన స్వరం సన్నగా వణికింది.

ఆయన చూపుల్ని ఎదుర్కొనలేక భూపాలరావు తల దించుకున్నాడు.

"వీడు నా బిడ్డ అని చెప్పుకుని గర్వించే అదృష్టం కొందరికే దక్కుతుంది. మీ అబ్బాయి కృష్ణ తెలివితేటలు, గుణగణాల గురించి ఎంతో గొప్పగా విన్నాను. అంత ఉత్తముడైన బిడ్డను పోగొట్టుకోవటం ఎంతో దురదృష్టం."

ఇంతలో లోపల్నుండి సన్నగా ఏడుపు వినిపించింది. ఆ కంఠం సుబ్బారావుగారి భార్యదై వుండాలనుకున్నాడు భూపాలరావు. ఆయన మనసును పిండినట్లయింది.

"తండ్రిగా మగవాడు పిల్లల్ని బాధ్యతలతో ముడిపెట్టుకుంటాడు. తల్లిగా స్త్రీ బిడ్డల్ని మమతానురాగాలతో ముడివేసు

కుంటుంది. తల్లి గనుక ఆమె తట్టుకోలేక పోతున్నది... మాకు ఒక్కగానొక్క బిడ్డ... ఆశలన్నీ వాడిమీదనే పెట్టుకున్నాం, కాని . " సుబ్బారావుగారి కళ్ళల్లో నీటిపొర సుడులు తిరిగింది.

కేవలం ఓదార్పుమాటలు వారిని పూరదించలేవని భూపాలరావుకు తెలుసు. అందుకే మౌనం వహించాడాయన.

కొద్ది నిమిషాలకు సుబ్బారావుగారి భార్య లోపల్నుండి కాఫీ గ్లాసుతో వచ్చింది. "తీసుకోండి అన్నయ్యగారూ!" అంటూ గ్లాసు టీపాయిమీద వుంచింది.

కళాకాంతులు లేకుండా పీక్కుపోయిన ఆమె ముఖంలో దుఃఖఛాయలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఆమె కళ్ళ చుట్టూ నీటితడి ఇంకా ఆరలేదు.

"ఎందుకమ్మా నాకీ మర్యాదలు!" అన్నాడు భూపాలరావు బాధగా తలొంచుకుంటూ.

"జరిగినదానిలో మీ తప్పేముందిలే అన్నయ్యగారూ! ఇదంతా మా ప్రారబ్ధం." అంటూ ఆవిడ లోపలకు వెళ్ళిపోయింది.

ఆ దంపతుల సంస్కారం, ఔన్నత్యం భూపాలరావును సిగ్గుపడేలా చేస్తున్నాయి. శోకపరితప్తులైన వాళ్ళ విరసనా, శాపనార్థాలు తను భరించక తప్పదన్న ఉద్దేశంతో అన్నిటికీ సిద్ధపడే వచ్చాడు. కాని వూహించినదానికి భిన్నంగా వున్న ,వాళ్ళ ప్రవర్తన ఆయనను విచలితుడ్ని చేసింది.

"చల్లారిపోతాయి తీసుకోండి," సుబ్బారావుగారు గుర్తుచేసేరు.

భూపాలరావు గ్లాసందుకున్నాడు.

"మీ దుఃఖాన్ని పాలిమనిషిగా పంచుకోలేను, మర్నించటం తప్ప నేను చేయగలిగిందేమీలేదు. బిడ్డను పోగొట్టుకున్న తండ్రిగా లోకానికి మీపట్ల సానుభూతి వుంటుంది. అందుకు కారకుడైన బిడ్డకు తండ్రిగా నాకు తలవంపులు తప్పలేదు." భారంగా అన్నాడు భూపాలరావు, కాఫీ గ్లాసు టీపాయిమీద పెడుతూ.

"జరిగినదాన్ని ఇక మరిచిపోవటమే మంచిదని నా ఉద్దేశం. బిడ్డల్ని కనగలం కాని రాతల్ని కనలేం గదా! ఉద్రేకపూరితమైన ప్రేరణలు, ఆకర్షణలూ యువతరాన్ని వక్రంగా ప్రభావితం చేస్తున్నాయి. తండ్రిగా మీరు మాత్రం ఎంతవరకు బాధ్యత వహించగలరు!" ప్రశాంతంగా అన్నారు సుబ్బారావుగారు.

భూపాలరావు ఏం మాట్లాడలేదు. కను చేతపట్టుకొచ్చిన లెదర్‌బాగ్ తెరిచి అందులోనుండి డబ్బు తీసి పదివేల రూపాయల నోట్లకట్టలు టీపాయిమీద వుంచాడు. సుబ్బారావుగారు అయోమయంగా ఆయనకేసి చూసేరు.

"ప్రాణానికి డబ్బుతో వెలకట్టాలనుకునేంత మూర్ఖుడ్ని కాదు. మీ ఇబ్బందులకు ఇది ఏమాత్రం ఉపయోగపడినా నా జన్మ ధన్యం అయినట్లు భావిస్తాను.

దయతో మీరు స్వీకరిస్తే జరిగినదానికి ఓ వంతయినా ప్రాయశ్చిత్తం అవుతుంది."

సుబ్బారావుగారు పేలవంగా నవ్వేరు. "ఈ డబ్బు మా గాయాన్ని మాన్పుతుందని మీరు అనుకుంటున్నారా?"

"క్షమించాలి! మీ కేదో సహాయం నేను చేయగలిగిందేమీ లేదు గనుక చేయాలి అన్న నా తపనకు అంతకన్నా నేను చేయగలిగిందేమీ లేదు కనుక ఇస్తున్నాను. కేవలం నా తృప్తికోసం." ప్రాధేయపూర్వకంగా అన్నాడు భూపాలరావు.

సుబ్బారావుగారు కాస్త ఆవేశానికి లోనైనారు. "ఈ డబ్బు మా బిడ్డ నివ్వలేదు. వాడి చదువుకోసం కాస్తోకూస్తో అప్పులయినా తీర్చుకోలేని దుస్థితిలోలేను. ఐశ్వర్యవంతుడ్నన్న అహం మీ సంస్కారానికి తెర కప్పుతున్నది."

ఆయన మాటలు భూపాలరావు మనసును సూదుల్లా గుచ్చాయి.

"నా నిస్సహాయతను మీరు దయతో అర్థంచేసుకోండి. నా ఐశ్వర్యంతో మిమ్మల్ని అవమానించాలనుకునేటంతటి సంకుచితుడ్ని కాను. ఎందుకో నా కిలా చేయాలనిపించింది." అన్నాడు బాధనిండిన స్వరంతో.

సుబ్బారావుగారు కొద్ది నిమిషాలు మాట్లాడలేదు. సాలోచనగా కళ్లు మూసుకున్నారు. మెల్లగా ముందుకు వంగి డబ్బు చేతిలోకి తీసుకున్నారు.

"చూడండి! ఈ డబ్బు వలన నాకే ప్రయోజనం లేదు. కాని ఈ డబ్బుతో మీ బిడ్డ జైలుపాలు గాకుండా కాపాడుకోనటానికి ప్రయత్నించండి. శిక్షపడటం వలన మీ బిడ్డ భవిష్యత్తు సర్వనాశనం అవుతుందే కాని పోయిన మా బిడ్డ తిరిగి మాకు దక్కడు. మీరైనా మీ బిడ్డను రక్షించుకోండి. అదే నాకు సంతోషం." అన్నారు, డబ్బుకట్టలు తిరిగి ఆయన చేతిలో పెడుతూ.

సుబ్బారావుగారి మాటల్లో వ్యంగ్యం వుందేమోనని ఆయనకేసి పరిశీలనగా చూసేడు. ఆయన ముఖంలో ఆ ఛాయ లేసీ లేవు. ఆయన కళ్ళల్లో క్షమాహృదయమే ప్రతిఫలిస్తుంటే భూపాలరావు చలించిపోయేడు! సుబ్బారావుగారి ఔన్నత్యానికి కళ్ళు చెమర్చాయి.

"మాస్టారూ! నే నెంత అల్పుడ్నో నాకు అర్థమయింది. మీ మనసు నొప్పించినందుకు నన్ను మన్నించండి." అంటూ డబ్బు సంచిలో పెట్టుకుని లేచి బయటకు నడిచారు.

కారు బయల్దేరిన శబ్దం వింటూనే ఆయన కుర్చీలో వాలిపోయేరు. లోపల నుండి ఆయన భార్య ఏడుపు సన్నగా వినిపిస్తున్నది. ఆయన మనసులో కొడుకు మెదిలాడు.

సుబ్బారావుగారు సెకండరీగ్రేడు టీచరుగా ఇరవయ్యేళ్ళనుండి పనిచేస్తున్నారు.

త్వరగా డబ్బు తీయవయ్యా లేకపోతే పొడవాల్సి వస్తుంది! అసలే నాకు రక్తం చూస్తే కళ్ళు తిరుగుతాయి!




ఆయన ఏ వూళ్లో వున్నా పిల్లలకు చదువు చెప్పటంలోను, వాళ్ళని క్రమశిక్షణలో వుంచటంలో చూపే శ్రద్ధ అందరి మన్ననలను పొందుతోంది.

జీతంరాళ్ళే ఆయనకు ఆధారం. వెనక పెద్దలు సంపాదించి ఇచ్చిన సెంటుభూమి కూడా లేదు. వున్నంతలో సర్దుకుంటూ గుంభనంగా జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఆయనకు ఒక్కడే కొడుకు కృష్ణ.

తెలివితేటల్లోనూ, క్రమశిక్షణలోనూ తండ్రికి తగ్గ కొడుకనిపించుకున్నాడు. టెన్త్‌క్లాసు పరీక్షల్లో స్టేటురాంక్ పొంది ఆ వూరి స్కూలుకి పేరు తెచ్చాడు. తనకొచ్చే జీతంతో కొడుకును బస్తీలో వుంచి చదివించటం ఇబ్బందితో కూడుకున్నదైనా వెనకాడదల్చలేదు.

ఇంటర్‌మీడియట్‌లో కూడా స్టేట్ రాంక్ వచ్చింది. కృష్ణ ఆసక్తికి తగినట్లే ఇంజనీరింగ్‌లో సీటు కూడా వచ్చింది. ఆ దంపతుల ఆనందానికి అంతులేకుండా పోయింది. చదువుసంధ్యలపట్ల ఆసక్తి చూపకుండా అకతాయిగా తిరిగే తమ బిడ్డలకు కృష్ణనే అవూరివాళ్ళు ఆదర్శంగా చెప్తారు.

కృష్ణ తమకు దేవుడిచ్చిన వరంగా సుబ్బారావు దంపతులు మురిసిపోతుండే వాళ్ళు. తమ వంశానికే వాడెంతో పేరు ప్రతిష్ఠలు తెస్తాడని ముచ్చటపడేవాళ్ళు. వాళ్ళ ఆశలన్నీ ఆ బిడ్డమీదనే.... సరిగా అప్పుడే ఎవరూ వూహించనంత దారుణం జరిగిపోయింది.

ఆ రోజు సుబ్బారావుగారు క్లాసులో పాఠం చెప్తున్నారు. ప్యూను చీటి తెచ్చి ఇచ్చాడు. వెంటనే ఆఫీసురూంకి రమ్మని హెడ్మాస్టరు నుండి కబురు.

ఆయన ఆఫీసురూంకి వెళ్ళేసరికి హెడ్‌మాస్టర్‌తోపాటు పోలీసులు కూడా వున్నారు.

"ఏిరేవండి సుబ్బారావుగారు!" హెడ్ మాస్టరు యస్.ఐ.కి పరిచయం చేసేరు.

"కృష్ణ మీ అబ్బాయిపేరే కదూ!"

"అవునండీ!" ఆయనగుండె వేగంగా కొట్టుకోసాగింది.

"మీరు నాతో విజయవాడ రావాలి. తీసుకెళ్లేందుకు వచ్చాను." అన్నాడు యస్.ఐ. సౌమ్యంగా.

"మా అబ్బాయిని గురించి అడుగుతున్నారు. వన్ను రమ్మంటున్నారు.... విషయం ఏమిటో నాకుబోధపడటంలేదు" అడిగాడాయన వణుకుతున్న స్వరంతో.

"మాస్టారూ! కాలేజి ఎన్నికల్లో స్టూడెంట్స్ గొడవపడ్డారు. దెబ్బలు తగలటంతో మీ అబ్బాయిని హాస్పిటల్లో చేర్పించాం. కంగారు పడవలసిందేమీ లేదు." అంటూనే యస్.ఐ. బయటకు దారితీసేడు.

సుబ్బారావుగారి గుండె దడదడ లాడింది. పోలీసులతో పాటు జీపు ఎక్కారు. వెళ్తున్నంతసేపూ తనబిడ్డ కే ప్రమాదం జరగకూడదని భగవంతుడ్ని ప్రార్థిస్తూనే వున్నారు. ఒక గంటన్నరలో జీపు హాస్పిటల్ చేరింది. బయట స్టూడెంట్స్ గుంపులు గుంపులు నిలబడి కనిపించారు. అందరి ముఖాల్లోనూ భీతి, విచారం అలుముకుని వున్నాయి.

హాస్పిటల్లో పోలీసులవెంట వడుస్తున్న సుబ్బారావుగారి కాళ్ళు గజగజ వణుకుతున్నాయి. మనసులో శంకరకాల సందేహాలు ముసురుతూ భయకంపితుడ్ని చేస్తున్నాయి. పోలీసులు వార్డులన్నీ దాటుకుని మార్చురీలోకి అడుగుపెట్టారు.

యస్.ఐ. లోపలికి అడుగుపెడ్తూనే ఒక శవంమీద కప్పివున్న రక్తసిక్తమైన తెల్లని దుప్పటిని తొలగించాడు. మాంసం ముద్దలా నిర్జీవంగా పడివున్న కొడుకు శవం చూస్తూనే సుబ్బారావుగారు నిలువెల్లా కంపించిపోయారు. భీభత్సంగా వున్న ఆ దృశ్యంచూసి తట్టుకోలేక గావుకేకపెట్టి స్పృహతప్పి పడిపోయారు.

ఆశల్నీ కోరికల్నీ పాదుచేసి ప్రేమతో పెంచిన లేతమొక్క పూలు పూయకనే, కాయలు కాయకనే పశువుల తాకిడికి పెళ్ళగించబడింది.

కొడుకు మరణానికి గల కారణాలు ఒక్కొక్కటిగా తర్వాత తెలిసొచ్చాయి. కాలేజీ ఎన్నికల్లో కృష్ణ సెక్రటరీగా పోటీ చేసేడు. నిజానికి చదువు తప్ప మిగతా విషయాలేవీ పట్టించుకోని కృష్ణకు ఎన్నికల్లో పోటీచేయాలన్న ఆసక్తి ఏమాత్రం లేదు.

కృష్ణకు ప్రత్యర్థిగా, డబ్బూ, పలుకుబడీ దండిగావున్న భూపాలరావు అనే ప్రసిద్ధ వ్యాపారి కొడుకు రవి పోటీ చేసేడు. రవికి చదువొక్కటే ఆసక్తి లేని విషయం. ఎప్పుడూ ఓ గుంపును వెంటేసుకుని సినిమాలకు, షికార్లకు తిరగటం, ఆడపిల్లల్ని ఏడిపించడం, ఆడపా

దరపా దౌర్జన్యాలకు దిగడంలాంటి అగడాలకు పెట్టిన పేరు.

అతను ఎన్నికల్లో పోటీచేయడంతోనే అసలు గొడవ మొదలైంది. తెలివితేటల్లో నడవడిలో అందరి మన్ననలనూ పొందినవాణ్ని ఎదురునిలిపితే రవిని ఓడించవచ్చున్న ఆలోచనతో అతని వ్యతిరేకవర్గం అందుకు తగ్గవాడు కృష్ణ అన్న అభిప్రాయానికి వచ్చింది.

కృష్ణ పోటీచేసేందుకు మొదట ఒప్పుకోలేదు. 'నీలాంటి మంచివాడుంటేనే స్టూడెంట్ యూనియన్‌కి విలువుంటుందనీ, అంతా నిన్నే సపోర్టుచేస్తారనీ, ప్రచార తతంగం అంతా మేము చూసుకుంటామనీ' రకరకాలుగా అతణ్ని వత్తిడి చేసేరు. అంతమంది స్నేహితుల మాట కాదని నొప్పించలేక కృష్ణ సరేనన్నాడు.

నామినేషన్ వేశాడే కాని అత వ్యత అతనేమీ పట్టించుకోలేదు. మిగతా కథంతా అతణ్ని నిలబెట్టిన వర్గం నడిపించింది. కరపత్రాలు పంచటం, పోస్టర్లు అంటించటం టౌనులోని వీధివీధికి కార్లలో తిరుగుతూ విద్యార్థుల ఇళ్ళకు వెళ్ళి ఓట్లడగటం లాంటి ప్రచార కార్యక్రమం ముమ్మరంగా కొనసాగించారు. రవి వర్గం కూడా ఏమాత్రం తీసిపోలేదు.

కృష్ణ మంచితనం, తెలివితేటలు అతనికి బాగా అనుకూలించాయి. కృష్ణచేతిలో ప్రత్యర్థులు చిత్తుగా ఓడిపోయేరు రవికి రెండొందల ఓట్లన్నా రాలేదు. జయజయధ్వానాలతో కృష్ణను భుజాలమీద కెత్తుకున్నారు.

హఠాత్తుగా ఓ రౌడీమూక మారణాయుధాలతో వాళ్ళమీద విరుచుకు పడింది. రవి వాళ్ళకు నాయకత్వం వహించాడు. ఒకటీ అరా దెబ్బలతో ఎక్కడివాళ్ళక్కడ పారిపోయారు. అమాయకంగా వాళ్ళచేతికి దొరికిన కృష్ణమీద వాళ్ళ కోపం చూపించారు. చిత్తుచిత్తుగా కొట్టి క్షణాల్లో పారిపోయారు. కృష్ణను హాస్పిటల్లో చేర్చిన కొద్ది సేపట్లోనే ప్రాణాలు పోయాయి.

కారులో తిరిగి విజయవాడ వెళ్తున్న భూపాలరావు మనసు వేదనకు గురయింది. సుబ్బారావు దంపతుల శోకహృదయం ఆయనను కదిలించివేస్తున్నది. తన సంపద యావత్తు ధారపోసినా వారి దుఃఖాన్ని పోగొట్టలేడు తను. వారి పుత్రశోకానికి కారణుడైనవాడు రవి కేవలం తన కొడుకేనా? ఇందులో తనవంతు తప్పు ఏమీ లేదా? ఆయన మనసు పరిపరివిధాల ఆలోచిస్తున్నది.

ఒక్కడే కొడుకన్న అపేక్షతో వాడు ఆడింది ఆటగా, పాడింది పాటగా గారాబం చేయటంవలనే ఇలా తయారయినాడా? వ్యాపారంలో లక్షలు ఆర్జిస్తూ బిడ్డ బాగోగుల్ని ఏమాత్రం పట్టించుకోకపోవటం తన నేరం కాదూ?

తన కొడుకుగా వాడు వెలుగురిలో

ప్రత్యేకంగా కనపడాలన్న అహంకారంతో అడిగినంత డబ్బు సంతోషంగా ఇచ్చాడే కాని అది వాడ్ని పెడత్రోవన పెడ్తుందేమోనని ఏనాడైనా ఆలోచించాడా? బాధ్యతాయుతమైన తండ్రిగా ఎప్పుడైనా ప్రవర్తించాడా?

"నాన్నా నాకు ఐదువేలు కావాలి!"

"అంత డబ్బెందుకురా రవీ!"

"కాలేజీ ఎన్నికల్లో పోటీచేస్తున్నాను."

"అయితే డబ్బెందుకురా? అక్కడా ఓట్లు కొనేదాకా రాజకీయాలు ముదిరాయా?" అన్నాడు తను నవ్వుతూ.

"ఇంకా లేదుగాని నలుగుర్నీ ఆకర్షించుకోవాలంటే ఎక్కడైనా ప్రచారం ముఖ్యం."

"అయినా నీ కెందుకురా ఈ రాజకీయాలు బుద్ధిగా చదువుకోక."

"ఈ మాత్రానికే చదువేం పాడవదు. నేను సెక్రటరీగా పోటీచేస్తున్నాను. నీ కొడుకునై వుండి ఓడిపోతే నీకు మాత్రం చిన్నతనం కాదూ?"

ఆ మాటలకు తను లొంబడిపోయాడు. వెనుకాముందు ఆలోచించకుండా డబ్బు రవి అడిగినదానికన్నా ఎక్కువే చేతిలో పెట్టాడు. వాడి పట్టుదలకు ముచ్చటపడ్డాడు.

"థాంక్యూ నాన్నా! నా మాట నువ్వు కాదనవని తెలుసు." సంబరపడిపోతూ డబ్బు తీసుకు వెళ్ళిపోయాడు.

వూర్నిండా రవి ఫోటోలతో అంటించి వాల్‌పోస్టర్లు, స్లోగన్స్ చూస్తూ తన కొడుకు ఇంత ఎదిగాడా అనుకుంటూ మురిసిపోయాడు. ప్రముఖ వ్యాపారవేత్త పురప్రముఖులు అయిన భూపాలరావు కొడుకుగా వాడు ప్రచారంచేసుకోవటం తనకెంతో సంతోషం కలిగించింది. వాడి విజయంతో తన ప్రతిష్ఠ ముడిపడి వుందనుకున్నాడు.

"నాన్నా! నువ్వు ఢిల్లీ వెళ్తున్నావుగా! ఈ నాల్రోజులు నేను మన కార్లు వాడుకుంటాను" అడిగాడు రవి.

"అలాగే వాడుకోరా! నువ్వు ఓడిపోయావో టౌన్‌లో నాకు తల కొట్టేసినట్లవుతుంది, ఈ డబ్బు కూడా అవసరమైతే వాడుకో." అంటూ ఎంతో ప్రోత్సహించాడు.

ఈ ఎన్నికల తతంగం కేవలం పసితనపు ఆటగానూ, పట్టుదలగానూ భావించాడేగాని, పరిస్థితులు ఇంతలా విషమిస్తాయని వూహించలేదు తను.

కారు ఇంటిముందు ఆగింది. లోనికి వస్తున్న భూపాలరావును చూస్తూనే ఆయన భార్య ఆత్రంగా ఎదురొచ్చింది.

"ఏమండీ! అబ్బాయి గురించి ఏమన్నా ఆరా తెలిసిందా?"

"లేదు సరస్వతీ!"

"ఆ దేమిటండీ! వారంరోజులుగా అయిపులేదు బిడ్డ. ఏం తింటున్నాడో ఎక్కడ పడుంటున్నాడో!" అందావిడ



కళ్లు తుడుచుకుంటూ.

"ఎందుకే వాడ్ని గురించి అంత కంగారుపడతావు. వాడింకా పసివాడను కుంటున్నావా? ఎందు ప్రాణాల్ని అవలీలంగా తీయగల ఘనుడు." విసుగ్గా అన్నాడు భూపాలరావు

"మీరిలా పట్టనట్లు వుండిపోతే వాడి బ్రతుకేంగానూ? మీరు తలచుకుంటే వాడ్ని ఈ గండంనుండి గట్టెక్కించగలరు. లేకుంటే వాడు అన్యాయమైపోతాడు." ఏడుస్తున్నదామె.

"సరస్వతీ! తప్పుచేసిన వాడ్ని గురించి తల్లిగా ఇంత తల్లడిల్లి పోతున్నావే. ఏ తప్పు చేయకుండానే అకాలమరణానికి గురైన మరో బిడ్డ కన్నవాళ్ళ హృదయ వేదనను ఏమాత్రమైనా ఆలోచించావా?" అంటూనే ఆయన తన గదిలోకి వెళ్ళి పోయాడు.

రాత్రి పన్నెండు కావస్తున్నా భూపాల రావుకు కంటిమీద కునుకులేదు. సంఘర్షణతో ఆయన మనసు అల్లకల్లోలంగా వున్నది. సాయంత్రం పోలీసులు వచ్చి వెళ్ళారు. వాళ్ళు చెప్పినదాన్నిబట్టి చూస్తుంటే ఈ హత్యానేరంలో రవికి ప్రముఖపాత్ర వున్నదన్న విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఇప్పుడు తండ్రిగా తన కర్తవ్యం ఏమిటి? తండ్రిగా బిడ్డను రక్షించుకోవాలా! లేక బాధ్యతాయుతమైన వ్యక్తిగా న్యాయానికి తలవొగ్గాలా?

కాలింగ్‌బెల్ మోగింది. ఈ సమయంలో ఎవరు వచ్చివుంటారన్న ఆశ్చర్యంతో వెళ్ళి తలుపు తీశారు. నలిగిన బట్టలతో రవి!

"ఇన్నిరోజులు ఎక్కడ వున్నావురా?" తలుపులు మూస్తున్న రవిని అడిగాడు భూపాలరావు.

"వూళ్ళోనే వున్నాను? వూర్నుండి మనొచ్చావని తెలిసి ఇంకా అజ్ఞాత వాసం చేయాల్సిన ఖర్మ దేనికని వచ్చే శాను."

"ఇంత ఘాతకానికి ఎందుకు పూను కున్నావురా?"

"అప్డరాల్! వూరు పేరు లేనివాడు నన్ను ఓడిస్తాడా? వాళ్ళ మిడిసిపాటుకు తగిన గుణపాఠం చెప్పాను. మన పత్రా

ఏమిటో అందరికీ తెలిసొచ్చింది." రవి స్వరంలో గర్వం తొంగిచూసింది.

ఇంతలో అక్కడకు సరస్వతి నిద్ర లేచి రానేవచ్చింది. వస్తూనే కొడుకును ప్రేమగా దగ్గరకు తీసుకున్నది. "రవీ! ఈ వారంరోజులూ నీకోసం ఎంత కుమిలిపోతున్నానో తెలుసా! లేని పోని గొడవల్లో ఎందుకు తలదూరుస్తావురా! నీకోసం పోలీసులు రాని రోజంటూ లేదు. వాళ్ళచేతుల్లో పడితే ఇంకేమైనా వుందా!" ఆమె సన్నగా ఏడ్వసాగింది.

"అబ్బ వూరుకోవే గోల! నాన్నగారొచ్చారుగా అంతా చూసుకుంటారు. పోలీసులందేముందిలే. కోర్టుకి వచ్చి నాకు వ్యతిరేకంగా సాక్ష్యంచెప్పే దమ్ము ఎవడికుంది. తినటానికేవన్నా పెట్టు ముందు." అన్నాడు నిర్లక్ష్యంగా తల్లితో.

భార్యవెంట డైనింగ్‌హాల్లోకి వెళుతున్న రవి కేసి వింతగా చూశాడు భూపాలరావు. అరగంటకు సరస్వతి తిరిగొచ్చింది.

"వాడేమైనాడు!"

"వెళ్ళి పడుకున్నాడు. ఈసారికి వాడి తప్పు కాయండి. ఇకపై బుద్ధిగా వుంటాడు." సరస్వతి మాటలకు భూపాలరావు సమాధానం చెప్పలేదు.

కొద్దిసేపట్లోనే సరస్వతి నిద్రపోయింది.

భూపాలరావుకి మాత్రం కంటిమీద కునుకు లేదు. రవి తన తొందరపాటుకు విచారపడ్తాడని, పశ్చాత్తాపపడ్తాడనీ అనుకున్నాడు. కాని రవిలో ఆ ఛాయలేవీ లేకపోవటమే ఆయనను ఆందోళనకు గురిచేసింది. న్యాయమన్నా చట్టమన్నా రవికున్న చిన్నచూపు ఆయనను కలత పెట్టింది, రవి భవిష్యత్తుపట్ల ఆందోళనకు గురైనాడు.


తెల్లవారుఝాము నాలుగ్గంటలవుతుండగా కాలింగ్‌బెల్ మోగింది. భూపాలరావు నెమ్మదిగా లేచి బెడ్‌రూంనుండి హాల్లోకి వచ్చారు. తలుపు తీసేసరికి యస్.ఐతో సహా పదిమంది పోలీసులు లోపలకు వచ్చారు.

భూపాలరావు వాళ్ళకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా కొడుకు పడుకున్న గడకేసి నడిచాడు. ప్రశాంత స్వరంతో కొడుకును పిలుస్తూ తలుపు తట్టారు. నిద్రకళ్ళతో తలుపుతీసిన రవిని అమాంతం ఇద్దరు పోలీసులు ఒడిసి పట్టుకున్నారు.

అప్పుడే హాల్లోకి వచ్చిన సరస్వతి గుండె గుభేలుమన్నది. నోట మాటరాక నిశ్చేష్టురాలయింది.

"డాడీ!" అన్నాడు రవి భయంనిండిన చూపుతో.

"బాబూ! నువ్వు చేసిన నేరానికి ఏ శిక్ష పడకపోవటంకన్నా శిక్ష అనుభవించటమే నీ భవిష్యత్తుకు మంచిది." అంటూ భూపాలరావు పక్కకు తప్పుకున్నాడు.




పోలీసులు రవిని తీసుకెళ్తుంటే బావురుమన్నది. "ఏమండీ! అలా చూస్తూ వూరుకుంటారేమండీ" అంటూ ఆయన గుండెలమీద వాలిపోయింది.

"సరస్వతీ! వాడు చేసిన నేరంలో మనకూ భాగం వుంది. వాడిని చట్టం శిక్షిస్తుంది వాడిపట్ల మనం పెంచుకున్న ఆశలు ఇలా కూలిపోవటమే మనవంతు నేరానికి అనుభవించాల్సిన శిక్ష." అంటున్న భూపాలరావుగొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

రవి చేసిన నేరానికి శిక్షపడకుండా రక్షించేందుకు తను చేసే ప్రయత్నం వాణ్ని ఇంకా చెడుమార్గాల్లో నడిపిస్తుందన్న ఉద్దేశంతో భూపాలరావే స్వయంగా పోలీసులకు ఫోనుచేశాడన్న విషయం భార్యకు గాని కొడుకుగాని తెలియదు. బాధ్యతారహితంగా బిడ్డల్ని పెంచే తల్లిదండ్రులకు హెచ్చరికగా తను తీసుకున్న నిర్ణయం ఆయనకు తృప్తినిచ్చింది

